# మంత్రి కేటీఆర్ పర్యటనతో జోష్

● సూర్యాపేట జిల్లాకేంద్రం గులాబీమయం ● సభకు పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలు, నాయకులు



సూర్యాపేటలో స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

సూర్యాపేట అర్బన్ అక్టోబర్ 2 : మంత్రి కేటీఆర్ సూర్యాపేట పర్యటన బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో జిల్లా కేంద్రానికి చేరుకోగా యువత పెద్ద ఎత్తున బైకు ర్యాలీతో దురాజ్‌పల్లిలోని ఐటీ హబ్ భవన్ వరకు స్వాగతం పలికారు. ఐటీ హబ్ ప్రారంభం అనంతరం జిల్లాకేంద్రంలోని ఎస్టీపీ ప్లాంట్, మున్సిపల్ వాణిజ్య భవన సముదాయం ప్రారంభం అనంతరం కొత్త బస్టాండ్ నుంచి జూనియర్ సభా వేదిక వరకు పెద్ద ఎత్తున భారీ ర్యాలీ తీశారు. మంత్రి కేటీఆర్ కొత్త బస్టాండు వద్దకు చేరుకునే సరికి కోలాట బృందాలు, డప్పు చప్పుళ్లు డిజే పాటలు, బైక్ హారన్లు, కార్యకర్తల నినాదాలతో మార్మోగింది. దాదాపు 2కిలో మీటర్ల మేర జనాలతో ఎంజీ రోడ్డు కిక్కిరిసి పోయింది. దాదాపు 3కిలో మీటర్ల ర్యాలీకి దాదాపు రెండు గంటల సమయం పట్టింది. మహిళలు, కార్యకర్తలు, ప్రజలు, యువకులు జైకేసీఆర్, జై కేటీఆర్, జై జగదీశ్ రెడ్డి అంటూ నినాదాలు చేస్తూ సభా ప్రాంగణానికి చేరుకున్నారు.

## కేటీఆర్ ప్రసంగానికి... జేజేలు కొట్టిన యువత

మంత్రి కేటీఆర్ ప్రసంగం జరుగుతున్నంతసేపు యువత కేరింతలు, మహిళల కరతాల ధ్వనులతో ఉత్సాహభరితంగా సాగింది. ప్రసంగం మధ్యలో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలు గురించి వివరిస్తున్న సమయంలో చప్పట్లు, ఈలలతో సభా ప్రాంగణం మార్మోగింది. మంత్రి కేటీఆర్ కాంగ్రెస్, బీజేపీలను విమర్శిస్తున్న సమయంలో పెద్ద ఎత్తున ప్రజల నుంచి స్పందన లభించింది.

## అలరించిన ఏపూరి సోమన్న ఆటాపాట

ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన కళాకారుడు, ఉద్యమ కారుడు ఏపూరి సోమన్న ఆటపాటలతో సభా ప్రాంగణం మార్మోగింది. సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ తన పాటలతో చైతన్యపర్చారు. ప్రజలు సైతం ఏపూరి పాటలతో శృతి కలుపుతూ డ్యాన్సులు చేశారు.

## మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం

సూర్యాపేట అర్బన్ : పలు అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలకు జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఆయనతో పాటు స్వాగతం పలికిన వారిలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్ కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, శానంపూడి సైదిరెడ్డి, అధికారులు కలెక్టర్ వెంకట్రావ్, అదనపు కలెక్టర్లు వెంకట్‌రెడ్డి, ప్రియాంక, బీఆర్‌ఎస్ నాయకులు జుట్టుకొండ సత్యనారాయణ, ఉప్పల ఆనంద్, నంద్యాల దయాకర్‌రెడ్డి, గండూరి ప్రకాశ్ ఉన్నారు.



ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు భారీ ర్యాలీతో స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు

## ప్రగతి నివేదన సభకు తరలిన బీఆర్‌ఎస్ మండల నాయకులు

సూర్యాపేట రూరల్ : జిల్లా కేంద్రంలో మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రగతి నివేదన సభకు బీఆర్‌ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ జీడీ భిక్షం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు ఉన్నారు.

## పెద్ద ఎత్తున తరలిన ప్రజానికం

పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం కోసం జిల్లా కేంద్రానికి వచ్చిన మంత్రి కేటీఆర్ సభను విజయవంతానికి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. గ్రామాల నుంచి ట్రాక్టర్లు, ఆటోలు, సొంత వాహనాలతో తరలి వచ్చారు. సభా ప్రాంగణం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాగణం కిక్కిరిసిపోగా జనమంతా పట్టణంలోని వీధుల్లో ఉండడం జరిగింది. సభ ముగిసే వరకు అక్కడే ఉండడం విశేషం.



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మున్సిపల్ సిబ్బంది



సభలో పాట పాడుతున్న గాయకుడు ఏపూరి సోమన్న



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్



సూర్యాపేట రూరల్ : సోలిపేట నుంచి ప్రగతి నివేదన సభకు తరలివెళుతున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు



సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

# దివ్యాంగులకు డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపుపై హర్షం

● సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

బొడ్రాయిబజార్, అక్టోబర్ 2 : గత ప్రభుత్వాలు దివ్యాంగులను విస్మరిస్తే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆదరించి అక్కున చేర్చుకుందని బీఆర్‌వీఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ నయీమ్ అన్నారు. జిల్లా కేంద్రంలో దివ్యాంగులకు 50 డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయింపును హర్షిస్తూ స్థానిక క్యాంపు కార్యాలయంలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి ఫ్లెక్సీకి సోమవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం దివ్యాంగులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించి సొంతింటి కలను సాకారం చేసిన ఘనత మంత్రి జగదీశ్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దివ్యాంగులు అద్దె ఇంట్లో ఉంటూ ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మంత్రి జగదీశ్‌రెడ్డికి తెలిపిన వెంటనే స్పందించి తమకు డబుల్ బెడ్‌రూం ఇండ్లలో అవకాశం కల్పించారని కొనియాడారు. అడగకుండానే పింఛన్లు పెంచి ప్రస్తుతం సొంత ఇంటిని అందించిన ప్రభుత్వానికి, మంత్రి జగదీశ్‌రెడ్డికి విధేయులుగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌వీఎస్ నాయకులు సాగర్‌నాయక్, వల్లపు లింగయ్య, జానయ్య, మల్సూర్, అర్షియ, సుప్రీమ్, ఫరీద్, ఉపేంద్ర, జానీ, శంకర్, షమీమ్, రవి, ప్రభుకుమార్ పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ అహింస మార్గంలో నడువాలి

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి

సూర్యాపేట లీగల్, అక్టోబర్ 2 : జాతిపిత గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సబ్ జైల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి పాల్గొని మాట్లాడారు. నేరారోపణపై జైలుకొచ్చిన వారు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది పెండ్యం వాణి, న్యాయవాదులు ఎం.వెంకట్‌రెడ్డి, వెంకన్నతో పాటు ఇతర న్యాయవాదులు జైలు అధికారులు పాల్గొన్నారు. అనంతరం కార్యదర్శి పి.శ్రీవాణి జైలు గదులు, వారికి ఇచ్చే ఆహారాలను పరిశీలించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు.



కోర్టు ఆవరణను ఊడ్చి శుభ్రం చేస్తున్న జడ్జిలు, న్యాయవాదులు

## పరిశుభ్రత పాటించాలి

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి సూర్యాపేట ప్రధాన, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.సురేశ్, జె.ప్రశాంతి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపల్లి లింగయ్య, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవీందర్, సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.అశోక్‌తో కలిసి కోర్టు ఆవరణను శుభ్రం చేశారు. తరువాత ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే మన ఆరోగ్యం ముడి పడి ఉంటుందన్నారు.

# నిరుద్యోగులకు కేంద్రం మొండి చెయ్యి

● ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండలు

హుజూర్‌నగర్ , అక్టోబర్ 2 : నిరుద్యోగులకు కోటి ఉద్యోగాలు కల్పిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చిన మోదీ వాటిని తుంగలో తొక్కి యువతకు మొండి చెయ్యి చూపారని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేవూరి కొండలు విమర్శించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ వ్యక్తులకు అప్పనంగా కట్టబెడుతుందని విమర్శించారు.